# మా వా డు

మావాడు కవి, కథకుడు, గాయకుడు, నటుడు, చిత్రకారుడు. అందర్నీ కలిపితే వచ్చేమిశ్రమమే మావాడు. వాడు రాసినన్ని కథలూ, అల్లినన్ని పద్యాలూ, గేయాలూ, గీసినన్ని చిత్రాలూ ఇంకెవ్వరూ రాసి, అల్లి, గీయగలిగి వుండరు. ఈ ఫీల్డులో మావాడు రికార్డు బ్రేక్‌చేసేడన్న మాటే. అయితే నేనెరిగినంతమట్టుకు మావాడి జీనియస్‌ని వెల్లడిచేసేదేదీ పూర్వం ఏపత్రికలోనూ పబ్లిష్ కాలేదు. పబ్లిష్ కాకపోడం తన తప్పు కాదంటాడు మావాడు. తనతెలివితేటల్ని "రికగ్నైజ్" చెయ్యడానికి అవతలవాళ్ళకి తెలివితేట లుండాలి. వాళ్ళకది లేకపోతే అది వాళ్ళల్లో లోటు. తనలోటుకాదు. అందుచేత ఆరోజుల్లో మావాడిదేదీ ప్రచురణ కాలేదు. కాగా మావాడి ప్రచురణ కాని గ్రంథాలన్నీ కలిపి ఓ పబ్లిక్ లైబ్రరీ స్థాపించవచ్చు. ఎవరికైనా ఆ సంకల్పంవుంటే మా వా డవన్నీ ఉచితంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు.

ముందుగా మావాడికి కవిత్వం అలవడ్డాది. మొదట్లో ఛందోబద్ధంగా పద్యాల్రాయడానికి ప్రయత్నించేడు. చేతకాలేదు. సరే ఛందస్సు పనికిరాదన్నాడు. దాని Utility పోయిందన్నాడు. అందుచేత భావ కవి ననిపించుకున్నాడు. పూర్వకవుల్ని పడతిట్టేడు. తిట్టున్నాడుకూడా. ఒకరికీ ఒరిజినాలిటీ లేదన్నాడు.

"ఈకాలపువాళ్ళల్లో ఎవర్రా గొప్ప కవి?" అని ప్రశ్నిస్తే మావాడు తన ఉంగరాల జుత్తు ఆడేలా తలూపుతూ "ఈ కాలంలోకూడా చెప్పుకోతగ్గ కవి లేడంటాడు. ఎవరికీకూడా "ఊహ" లేదుట. వాళ్ళభావాలు పరిగెత్తవుట. కవిత్వం కుంటుపోయిందిట. దాన్ని పునరుద్ధరించాలంటే ఓ జీనియస్ పుట్టాలిట. ఆ జీనియస్ తనేనని మావాడి రహస్యాభిప్రాయం.

ప్రప్రథమంలో మావాడు ప్రకృతిమీద గేయాల్రాసేవాడు. మా పెరట్లో చెట్టుమీద కూర్చుని కోయిల అరుస్తూవుంటే (తప్పు, తప్పు పాడుతూవుంటే) మావాడి "హృదయవీణె" మ్రోగిపోయేది. గాంధర్వగానం వింటున్నట్టు స్తంభించిపోయేవాడు. కాని రానురాను మావాడికి ప్రకృతిమీద మోజు తగ్గిపోయింది. "ప్రేయసి"మీద విరుచుకుపడ్డాడు. ఆ ప్రేయసిమీద అనేక గేయాలల్లేడు. నానాబాధలూ పడ్డాడు. ప్రేయసి కవుగిల్లో విశ్రమించాలనీ, ప్రి యు రా లి కంఠాన్ని పెనవేసుకుపోవాలని, ఆమెలో ఐక్యమైపోదామనీ ఇటువంటి ఊహలు వెలిపుచ్చేవాడు.

మా ఇంటిప్రక్క పదిహేడేళ్ళ అమ్మాయొకతె వుండేది. ఆమె "లేడికళ్ళు" చూసి మావాడు మోహపరవశుడైపోయేడు. ఆమెతో మాట్లాడాలనే కోరిక ఎక్కువగా ఉన్నప్పటికీ బిడియ పూజకి జడిసి కోరికలు నెరవేర్చుకోలేకపోయేడు. ఆమె హరిణనేత్రాల మీదా, అవయవ పుష్టిమీదా కవిత్వం చెప్పేడు. అవి ఇతరులెవరూ చదవకపోడంచేత చదివి వినిపించేవాడు. వాళ్ళు వినకపోతే తనే చదువుకునేవాడు. ఆ అమ్మాయి ఆఖరికి ఓ పోలీసువాడితో లేచిపోయింది. అప్పుడు మావాడు విరహగీతాల్లో హృదయావేదన తగ్గించుకున్నాడు. తాపం తగ్గింది. 2 దస్తాల కాగితాలు తీసుకొచ్చి నాకు చూపించేడు. చదవమన్నాడు. నాకేం బోధపడలేదు. "ఇదేమిట్రా" అన్నాను.

"నా అశ్రుధారల్తో, నా హృదయంమీద రాసుకున్న గీతాలివి" అన్నాడు. ఇది చాలాకాలంకిందటి విషయం.

తరువాత మావాడు సంఘాన్ని దూషించేడు. సంఘమనే క్రూరరాక్షసి చావాలన్నాడు. ఎక్కడకెళ్ళినా దాని విషవాయువువల్ల ఉక్కిరిబిక్కిరైపోతూనే "ఆకలిమంటల" మీద పద్యాలల్లేడు. లోకంలోవుండే దారిద్ర్యాన్నీ, దుఃఖాన్నీ చూసి మధ్యాహ్నం కడుపునిండాభోంచేసి మావాడు కన్నీరు కార్చేవాడు. వాళ్ళబాధల్ని తల్చుకుంటేనే తను చిక్కిపోతున్నాననేవాడు. కలంద్వారా సానుభూతి చూపడం తప్ప ఇతర సహాయం చెయ్యడానికి మావాడు అశక్తుడు.

ఇహ కథారచన.

మావాడనేక కథలు రాసేడు. అనేక రకాలైనకథలు రాసేడు. కాకి-పిచ్చికా కథలు మొదలుకొని, మా వాడికి తోచిన గొప్పగొప్ప భావాల్తోనూ, ఊహల్తోనూ కథానికలు రచించేడు. లవ్ స్టోరీస్ మాట చెప్పనక్కరలేదు. తనని హీరోచేసుకుని, మా పొరుగావిణ్ణి హీరోయిన్ చేసి రసవత్తరమైన ఘట్టాల్ని కల్పించేడు. తన మనసులో ఉండే కోరికల్ని ఈవిధంగానైనా కొంతవరకూ తీర్చుకోగలిగేడు. తరువాత చలంగారిలాగ కథలు రాద్దామనుకుంటే చేతకాలేదు. "డామిట్, ఇమిటేషన్ పనికిరాదం"టూనే రష్యన్ కథలననుసరించి రియలిస్టిగ్గా రాయబోయేడు. దానికి ఫలితంగా ప్రతి కథా తలా తోకా లేకుండా తేలింది. అన్నిపత్రికలూ మావాడి కథల్ని Reject చేసేయి. అయినా మావాడు నిరుత్సాహపడడు. "పెసిమిజమ్"తో మా వా డి కి సంబంధంలేదు. ఎల్లప్పుడూ, ఎన్ని అవాంతరా లొచ్చినప్పటికీ, ఎన్ని తొకరాలు తన్నుప్పటికీ మావాడు ఆప్టిమిస్టిగ్గా ఉంటాడు. సర్వం మేలుకొరకేనని మావాడివాదన. Everything is for the best in this best of all possible worlds అని మావాడి సిద్ధాంతం. ఉత్తమోత్తమమయిన మనలోకంలో అంతా ఉత్తమమే అని తెలుగులో చెపుతూ వుంటాడు.

అయితే వాడి ఆప్టిమిజమే వాడికి సహాయం చేసింది. మొన్నటి యుద్ధం పూర్తవగానే మావాడు అర్థంపర్థంలేని తన పూర్వపు రాతలన్నీ తిరిగి పత్రికలకి పంపేడు.

ఇంకేముంది?

మావాడో పెద్ద సర్రియలిస్టయి కూర్చున్నాడు.

రచన :
"జాస్మిన్"